- వి.ఆర్.విద్యార్థి
- దెందుకూరి రఘునాథ్
- అల
- అనసూయాదేవి




చిత్రాలు: దెందుకూరి రఘునాథ్

## సహ్యాద్రి బిడ్డలు

వి.ఆర్.విద్యార్థి



వసంత కాలపు ఒక వేకువన
సహ్యాద్రి కొండల్లో మేము
ఉషస్సుతోపాటు ఉద్యయించాం
కోకిల పాటల్లో ప్రవహించాం

ఉషాకిరణం కొండల్ని చుంబించగానే
చాలా సేపటికి తల్లిని చూసిన బిడ్డల్లా
కొండల వదనంలో
ఆనందపు వెలుగులు
అలుకల నీడలు

ఆర్యావర్తపు గుండె కండరాల్లా
ఈ కొండలు
ధమనిలా స్పందిస్తూ లోయల్లో
వాగురి నది సాగిపోతూ
ర్ద్రామ ఫలంలా లోయలు ఒక చోట గుహలై
ధనుస్సులా రాతి గుహలు మరోచోట

చాళుక్యుల కీర్తి పతాకాలైనా
రాష్ట్రకూటుల ప్రభా చంద్రహారాలైనా
బౌద్ధ జాతక గాధలైనా
జైన సాంప్రదాయ రూపాలైనా
హైందవ ధర్మ మార్గాలైనా
ఇవి ఎన్ని సహస్రాబ్దాల ఘనీబూత ఘర్మనదాలు..!



దేశపు గిరుల్ని చుంబించి, కడలి కెరటాల్ని కౌగలించి, ఎడారుల వొంటరి తనాన్ని ఓదార్చి, అడవుల ఏకాంతంతో చర్చించి, రెండు యుద్ధాల ప్రత్యక్ష సాక్షిగా వున్న వి.ఆర్. విద్యార్థి ఇవ్వాళ జీవన యుద్ధంలో క్షత గాత్రుల్ని చూస్తూ రిటైర్మెంట్ జీవితంలో కూడా అవిశ్రాంత సైనికుడిలా ఆలోచనల సమరంతో కవితా స్వామాజ్యాల్ని జయిస్తున్నారు. నివాసం వరంగల్..ప్రస్తుతం ఉన్నది అమెరికాలో.

శతాబ్దాల శ్రమకు సాక్ష్యాధారాలు
కళాతపస్వుల కలల ప్రపంచాలు
కాలనాళికలో కవలలు
ఈ అజంతా ఎల్లోరాలు..!
(అజంతా, ఎల్లోరాలు చూసి)

## అన్వేషణ

- దెందుకూరి రఘునాథ్





కనిపించీ కనపడని నా తెలుగుతనాన్ని
భూతద్దాలు పెట్టుకొని మరీ అన్వేషిస్తున్నా
పెళ్ళి చూపులకి అమెరికానుంచి
ఆంధ్రా కెళ్ళిన్నాటినుంచీ ఇప్పటిదాకా
టైట్ జీన్స్‌తో బాబ్డ్‌కట్‌తో హాయ్ అంటూ
పలకరించిన ఆ అమ్మాయిలో నా కలల నండూరి ఎంకినీ
రోడ్డు మీద పండుగనాడు సైతం కనిపించని ఆ
పరికిణీ ఓణీల కోసం, ఆ అందమైన జడకుచ్చుల కోసం
కళ్ళలో వత్తులు వేసుకు మరీ అన్వేషిస్తున్నా..
అమ్మా పికిల్స్‌లో అమ్మ చేతి రుచుల్నీ
గేమ్ బాయ్స్‌ల్లో కోతికొమ్మచ్చుల్నీ
పొద్దున్నే వినపడని రేడియో సుప్రభాతాన్ని
పాపప్పు ఆడ్‌ల్లో బాపు బొమ్మల్నీ
ఈ మెయిల్లో కనపడని నాన్న చేతిరాతల్నీ
ఎక్కడో పారేసుకున్న నా వ్యక్తిత్వాన్నీ
ఆరుబయట అర్ధచంద్రుడ్ని చూస్తూ ఆనందంగా
అన్నం ముద్దలు తిన్న ఆ రోజుల్నీ
బార్నీ కాసెట్ చూస్తూ తింటున్న మా అమ్మాయి నవ్వులో
ఇంకా.. ఇంకా అన్వేషిస్తున్నా !!
ట్వింకిల్ ట్వింకిల్ స్టారుల్లో ఉప్పు కర్పూరాన్నీ
ఎబిసిడిల్లో అఆలనీ
ఈ టీవీల్లో మా టీవీ మీ టీవీల్లో మా రేడియో అన్నయ్యనీ
సినిమాల్లో సావిత్రినీ
కనిపించకుండా పోయిన నా తెలుగు తనాన్ని

వరంగల్‌లో పుట్టి పెరిగిన రఘునాథ్ ప్రస్తుతం సిలికాన్ వేలీలోని సిస్కో సిస్టమ్స్‌లో పనిచేస్తున్నారు. భార్య, ఇద్దరు పిల్లలతో మిలిపిటాస్‌లో నివాసం. పెయింటింగ్స్, కార్టూన్స్ వేయడం, సంగీతం హాబీలు. వయొలిన్ నేర్చుకుంటున్నారు.

పశ్చిమంలో ఉన్న నేను తూర్పు కెళ్ళిన పడమరను
చూస్తూ అన్వేషిస్తున్నా
రాబోయే ఉదయానికై ఎదురుచూస్తూ
ఇసుకలో కూర్చున్న అంధ్రుల మధ్య
నా తెలుగు తనాన్ని అన్వేషిస్తున్నా.

(ఇసుక అంటే సిలికాన్ ..అంటే సిలికాన్ వేలీ అనే అర్థంలో)

## ఊహించు - ఆలోచించకు

- అల



ధరాతలం బీటలలో,
వృధా బ్రతుకు వాడొకడు
ధరాధిపతి కావొచ్చు,
రథాల పై తిరగొచ్చు ..
ఊహించే విధానమే!
బలానికీ ప్రధానం!!
ఆధారమే కరువంటూ,
విధారతతో వేరొకడు
వృధా చేయు బ్రతుకంతా
విధాత చేయు రాతంటూ..
ఊహించే విధానమే!
పతనానికీ, సమాధానం!!
ఉదకంలో మందు కన్న
ఊహ యిచ్చు హాయి మిన్న
ఊకదంపు పొందు కన్న
ఊహ ఇచ్చు విందు మిన్న



ఊహించే విధానమే
ఊరించిగెలిపించినా!!
ఊహించే విధానమే
ఉరేసి చంపించినా!!

## ఎనభై ఐదు ఉగాదుల సారాంశం

-"కళాప్రపూర్ణ" డా.అవసరాల (వింజమూరి) అనసూయాదేవి



నా అనుభవాలు అయాయి నా రచనలు
నా అసహాయత తెచ్చింది నాకు శక్తి
నాలో ప్రోద్బలం ఇచ్చింది నాకు బలం
నా కలంలో సిరాగా మారింది నా కన్నీరు
నా గళంలో పాటయింది మున్నీరు
నా వ్రాతలు జీవితపు రాతలు
నా కెదురైన అవమానాలు నా గౌరవానికి సోపానాలు
నా పంచ ప్రాణాలు - అనగా నా పిల్లలు
నన్ను ఆవరించే పంచభూతాలు..!
నా తొమ్మండుగురు మనుమలూ
నాకానందం చేకూర్చే నవరత్నాలు
ఇవన్నీ నీ లీలలే ప్రభూ!
ఒక్కదాన్నిగా 85 ఏళ్ళ జీవితం సాగిస్తున్నా
పెక్కు రూపాలలో నీ వాదుకుంటూనే ఉన్నావు
ఈ వ్యయ నామ సంవత్సరం కూడా నీవే కాపాడు.!!